లోపమును తీర్చుటకై ఆధునిక యుగము నందలి కవితోద్యాన పాలకు లగు కవి కుమారులు పెక్కురు నడుములు గట్టి రాత్రిందివములు పరిశ్రమ చేసి ఆ ప్రాంతౌదలను దిద్ది తీర్చి-అపూర్వములగు నందనములతో నలంకరించి - ఏ మాత్రముకూడా వన్నెయు వాసియును కొఱవడ నీయకుండ వెలసిల్లజేసి సార్వజనీనత నొనగూర్చుచున్నారు. వీరి యీ యుద్యమము శుద్ధమును సమృద్ధమునై యలరారంగల సూచనలు గన్పించుట మిగుల ప్రశంసనీయము.

ఈ విధముగాం ప్రస్తుత కాలమున మన యాంధ్ర సారస్వతోద్యానపు సార్వజనీన శాఖాభివృద్ధికై పాటుపడుచున్న చిరుత కవికుమారులలో శ్రీ యుతులు సండూరి వేంకట సుబ్బారావు పంతులు (బి. ఏ.) గారును నొక్కరు. వీరు చక్కని కవి ప్రపంచమునకు వెరిగారి తమ శుశ్రూషాంజలులను భిన్నమార్గమున నాంధ్రవాగ్దేవి సన్నిధి నలంకరించుచున్నారు. సుబ్బారావుగారు ఆంధ్రజాతికి సహజమునై శాశ్వతమునై - సొంపునింపగల మధురమధుర గేయములలో అందునునేడు - వాడుకలో - వ్యవహారములో నున్న ముద్దుభాషలో వెంకి నాయుడు బావల దాంపత్య ప్రీతిములను భావోన్నతిములను ముగ్ధముగ్ధములుగను తగు ప్రణయ గాథలను గానము సేయుచున్నారు. నిజముగా వెంకి నాయుడు బావ లనే నాయకులున్నారో, లేరో గాని కవి ప్రపంచములో చెప్పబడియున్నను - వెంకి పాటలను వినునప్పుడు మాత్రము, శ్రోతలు తన్మయతను జెంది తమ తమ భావనావీధులలో నిరుపమమూర్తులగు వెంకి నాయుడు బావలను తప్పక గాంచగలుగుదురు. ఒక్క గాంచుట మాత్రమేనా—గాంచి——తా మనుభవించిన ఆ యానందమును—— మరల నా గీతములతోనే అనువాదరూపమున వెల్లడింపని సహృదయ శిరోమణి యుండడయుగూడ గానము. వెంకి పాటలకింతటి మహత్త్వము గలుగుటకు తజ్జనకులగు వెంకటసుబ్బారావు పంతులుగారి రసానుభవ వ్యగ్రమగు హృదయ పరిణామ పేశలతయును, లోకజ్ఞతయును ముఖ్యములగు కారణములని నాకుగల నమ్మకము.

